## నీటి తిప్పలు భరించలేక రోడ్డెక్కిన జనం ధర్నాతో దిగివచ్చిన యంత్రాంగం




**మన తొలివెలుగు, మహేశ్వరం ప్రతినిధి ముత్తయ్య(24 ఆగస్ట్ 2026)** నీటి తిప్పలు భరించలేక రోడ్డెక్కిన జనం ధర్నాతో యంత్రాంగం దిగివచ్చి బోర్ వాటర్ సమస్యను పరిష్కరించడంతో పాటు బోర్ వాటర్ లైన్ మెన్ ని పర్మినెంట్‌గా కేటాయించడం జరిగింది. జనప్రియ మహానగర్‌లో నీటి సమస్య పరిష్కారం కోసం బడంపేట సర్కిల్ కార్యాలయం సమీపంలో మాజీ కార్పోరేటర్ పి.విజయలక్ష్మి రాజు స్థానిక నివాసులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి రాజు మాట్లాడుతూ బడంగ్ పేట్ సర్కిల్, ప్రశాంతి హిల్స్ 58వ డివిజన్ పరిధిలోని జనప్రియ మహానగర్‌లో గత కొన్ని రోజులుగా కొనసాగుతున్న బోర్ వాటర్ సమస్య తో జనప్రియ వాసులు అల్లాడిపోయారన్నారు. నీటి సమస్యతో పాటు లైన్ మెన్ సమస్యపై స్థానిక వాసులతో కలిసి బడంగ్ పేట డిప్యూటీ కమిషనర్ సమ్మయ్యకి గతంలో వినతిపత్రం అందించడం జరిగిందన్నారు. అయితే సమస్య పరిష్కారం కాకపోవడంతో సోమవారం బడంగ్ పేట సర్కిల్ కార్యాలయం సమీపంలో స్థానిక నివాసులతో కలిసి ధర్నా నిర్వహించడం నిర్వహించమన్నారు.ఈ సమస్యపై స్పందించిన బడంగ్పేట్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్, హెచ్‌ఎం డబ్ల్యూ ఎస్ ఎస్ బి అధికారులు పరస్పరం మాట్లాడుకుని జనప్రియ మహా నగర్ కాలనీ బోర్ వాటర్ సమస్యను పరిష్కరించడంతో పాటు బోర్ వాటర్ లైన్ మెన్ ను పర్మినెంట్‌గా కేటాయించారని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఎల్లప్పుడూ ప్రజలతో కలిసి పోరాడుతామన్నారు.నీటి సమస్యను పరిష్కరించి, లైన్ మెన్ ను పర్మినెంట్‌గా కేటాయించిన డిప్యూటీ కమిషనర్, హెచ్‌ఎం డబ్ల్యూ ఎస్ ఎస్ బి అధికారులకు, స్థానికులలి సమస్య పరిష్కారం కోసం కృషి చేసిన మాజీ కార్పోరేటర్ పి. విజయలక్ష్మి రాజు కు, కాలనీ వాసులు ధన్యవాదాలు తెలిపారు.

## పాదయాత్ర గోడ పత్రిక పోస్టర్ విడుదల




**మన తొలివెలుగు, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి జంగిటి రవీందర్ :** యాదాద్రి భువనగిరి జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులకు నిధులు విడుదల చేసి, పనులను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 29, 30, 31 తేదీల్లో భువనగిరి అంబేద్కర్ చౌరస్తా నుండి హైదరాబాద్ ఇందిరా పార్క్ వరకు పాదయాత్ర గోడ పత్రిక ను రైతుబజార్ లో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు మాయ కృష్ణ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహాధర్నాను విజయవంతం చేయాలని రైతులకు ప్రజలకు, పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పట్టణ సెక్రటేరియట్ సభ్యులు గంధ మల్ల మాతయ్య, బందెల ఎల్లయ్య, వనం రాజు, పట్టణ నాయకులు నరాల నరసింహా, బుర్ర అనిల్. కొత్త లలిత, మన్నె రాజు, డివైఎఫ్ఐ పట్టణ అధ్యక్షులు కార్యదర్శి మేడ పోయిన సుందర్ ఎండి సలీం పాల్గొన్నారు.

## జీపీ కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

సీఐటీయూ



**మన తొలివెలుగు, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి జంగిటి రవీందర్ :** గ్రామ పంచాయతీ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పైళ్ల గణపతి రెడ్డి, జిల్లా యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు దాసరి పాండులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు రిలే నిరాహార దీక్షలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఏళ్ల తరబడిగా గ్రామాలలో వాటర్ మెన్స్, పారిశుద్ధ్య కార్మికులుగా, బిల్లు కలెక్టర్గా, ఎలక్ట్రీషన్లుగా ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజల ఆరోగ్యాలను కాపాడుతూ పనిచేస్తున్న గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు అధ్యక్ష కార్యదర్శులు పొట్ట యాదమ్మ, రకరకంటి రాము, వర్కింగ్ ప్రెసిడెంట్ బిక్షం జ్ఞానేశ్వర్, నాయకులు కిష్టయ్య, పరమేష్, గ్రామపంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను సత్వరం పరిష్కరించాలి కలెక్టర్ చిత్రా మిశ్రా

**కరీంనగర్** : ప్రజావాణి దరఖాస్తులను సత్వరం పరిష్కరించాలని కలెక్టర్ చిత్రా మిశ్రా సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, డీఆర్ఓ స్వామి, ఇతర ఉన్నత అధికారులతో కలిసి దరఖాస్తులు స్వీకరించారు. ప్రజావాణి కి మొత్తం 193 దరఖాస్తులు వచ్చాయి. అత్యధికంగా నగరపాలికకు 58, గృహ నిర్మాణ శాఖకు 42 దరఖాస్తులు వచ్చినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ. సీఎం క్యాంపు కార్యాలయం, సీఎస్ ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారం పై ప్రత్యేక దృష్టి సారించారన్నారు.

## మహాసభలను జయప్రదం చేయండి

ఏఐటీయూసీ




**మన తొలివెలుగు, ?ఉమ్మడి మహబూబ్ నగర్ బ్యూరో :** కరీంనగర్ వేదికగా జరిగే ఏఐటీయూసీ తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభలను కార్మిక వర్గం భారీగా తరలివచ్చి జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మారేడు శివశంకర్ పిలుపునిచ్చారు. సోమవారం పాత కలెక్టరేట్ సమీపంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆటో స్టాండ్ వద్ద ఆటో కార్మికులతో కలిసి గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహాసభల సందర్భంగా నిర్వహించే కార్మిక ప్రదర్శన, బహిరంగ సభకు కార్మికులు పెద్ద ఎత్తున హాజరుకావాలన్నారు. ప్రతినిధుల సభలో రాష్ట్రవ్యాప్తంగా 1,000 మంది పాల్గొంటారని తెలిపారు. ?కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన 4 లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, 12 గంటల పనిదినాల విధానాన్ని నిరసిస్తూ కార్మికులు పోరాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు చిన్నపాగ శ్రీనివాసులు, ఆటో డ్రైవర్లు ఎం.డి. రజాక్, భీమయ్య, బాలస్వామి, సర్దార్ తదితరులు పాల్గొన్నారు.

## మహేశ్వరం నియోజకవర్గ అభివృద్ధికి మరో ముందడుగు

**బడంగ్‌పేట్ సర్కిల్‌లో రూ.65 లక్షలతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి**



**మన తొలివెలుగు, మహేశ్వరం ప్రతినిధి ముత్తయ్య (24 ఆగస్ట్ 2026)**మహేశ్వరం నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా బడంగ్‌పేట్ సర్కిల్ పరిధిలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు మాజీ మంత్రి, మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యే పి. సబితా ఇంద్రారెడ్డి శంకుస్థాపన చేశారు.బడంగ్‌పేట్ లోని ఏజీఆర్ కాలనీలో రూ.36 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు, నాదర్‌గుల్ శాంతి నగర్ కాలనీలో రూ.16 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు, గుర్రంగూడ జీబీఆర్ కాలనీలో రూ.13 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు సబితా ఇంద్రారెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూమొత్తం రూ.65 లక్షల వ్యయంతో చేపట్టనున్న ఈ అభివృద్ధి పనులతో ఆయా కాలనీలలో ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయన్నారు. కాలనీలలో మౌలిక వసతులను బలోపేతం చేయడంతో పాటు ప్రజల రోజువారీ అవసరాలకు అనుగుణంగా సౌకర్యాలు కల్పించేందుకు ఈ పనులను చేపడుతున్నామన్నారు.మహేశ్వరం నియోజకవర్గంలోని ప్రతి కాలనీలో ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా అభివృద్ధి కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తున్నామని తెలిపారు.ప్రజల అవసరాలకు అనుగుణంగా నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు తాను నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు.

## బాలాపూర్ గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలి




**మన తొలివెలుగు మహేశ్వరం ప్రతినిధి ముత్తయ్య ( 24 ఆగస్ట్ 2026) :** వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు ప్రశాంతంగా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముగిసేలా స్థానిక ఉత్సవ కమిటీ సభ్యులు పోలీసులకు, ప్రభుత్వ అధికారులకు పూర్తి సహకారం అందించాలని శంషాబాద్ డీసీపీ రాజేష్, బాలాపూర్ ఇన్స్పెక్టర్ సుధాకర్ కోరారు. రాబోయే వినాయక చవితి, నిమజ్జన ఏర్పాట్లపై పోలీసులు, బాలాపూర్ గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులతో వినాయకుని నిమజ్జనం జరిగే ప్రాంతాల్లో పర్యటించారు. అనంతరం బాలాపూర్ లో సమావేశం ఏర్పాటు చేశారు. శాంతి భద్రతలు, ట్రాఫిక్ నియంత్రణ, ఊరేగింపు సాఫీగా జరిగేలా చర్యలు తీసుకునే విధానం, ఉత్సవ మండపాల వద్ద, భక్తులకు ఇబ్బంది కలగకుండా ఉండేందుకు భారీగా పోలీసులను బందోబస్తుకు ఏర్పాట్లు, రద్దీ ఎక్కువగా ఉండే ప్రదేశాలలో ప్రత్యేక సీసీ కెమెరాల ను ఏర్పాటు చేసి, పటిష్టమైన నిఘా పై చర్చించారు. పండుగ ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని కోరారు.

## కేవైసీ చేసుకోకుంటే పెన్షన్ రద్దవుతుంది

**టీఆర్ఎస్ చార్మినార్ ఇంచార్జ్ పుప్పాల రాధాకృష్ణ**




**మన తొలివెలుగు తెలంగాణ బ్యూరో ప్రతినిధి :** పింఛనుదారులు కేవైసీ చేసుకుంటే పెన్షన్ రద్దు అవుతుందని, వెంటనే ప్రభుత్వం అందించే పింఛన్లు తీసుకుంటున్న వారు కేవైసీ చేయించుకోవాలని తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) చార్మినార్ నియోజకవర్గం ఇంచార్జ్ పుప్పాల రాధాకృష్ణ కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చార్మినార్, బహదూర్ పుర, బండ్లగూడ మండలాల పరిధిలో ప్రభుత్వం నుండి వృద్ధాప్య, ఆసరా, ఒంటరి మహిళ తదితర అన్ని రకాల పింఛన్లు తీసుకుంటున్న వారిలో కొన్ని వేల మంది ఇప్పటి వరకు కేవైసీ చేసుకోలేదని, వారి కేవైసీలు పెండింగ్ లో ఉన్నాయని తెలిపారు. కావున ఆయా మండలాల పరిధిలోని పెన్షన్ దారులు వెంటనే తమ ఆధార్ కార్డు తీసుకొని మండల ఆఫీసులకు వెళ్లి తమ కేవైసీని తప్పని సరిగా నమోదు చేసుకోవాలన్నారు. లేనిచో వచ్చే నెల నుండి పెన్షన్లు రద్దవుతాయని తెలిపారు. అలాగే గతంలో నేరుగా మండల ఆఫీసులో పెన్షన్ కోసం అప్లై చేసుకున్న ప్రజలు ఇప్పుడు మళ్లీ కొత్తగా మీసేవ సెంటర్లలో తిరిగి దరఖాస్తు చేసుకుంటేనే అవి చెల్లుబాటు అయ్యి కొత్త పింఛన్లు మంజూరు అవుతాయని పుప్పాల రాధాకృష్ణ తెలిపారు.

## గుర్తుతెలియని మృతదేహం లభ్యం - ఆచూకీ కోసం పోలీసుల విజ్ఞప్తి



**మన తొలివెలుగు, చాంద్రాయణగుట్ట, ప్రతినిధి** చత్రినాక పోలీస్ స్టేషన్ పరిధిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. తేది 19.08.2026 ఉదయం 08:40 గంటల సమయంలో ఉప్పుగూడ, శివాజీ నగర్ లోని శివాలయం సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు సమాచారం అందడంతో పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అతని వయసు సుమారు 40-45 సంవత్సరాలు ఉంటుందని, ఎత్తు 5 అంగుళాలు 2 అడుగులు, శరీరాకృతి మధ్యస్థంగా, ఛాయ నల్లగా, మొహము గుండ్రంగా, అతను ధరించిన దుస్తులు తెల్ల చుక్కల గీతలు ఉన్న నీలం రంగు చొక్కా, నల్ల ప్యాంటు, భిక్షాటన చేసుకుంటున్నట్లు అనుమానం. మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం ఉస్మానియా జనరల్ హాస్పిటల్ కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. కావున మృతుని గురించి తెలిసిన వారు, బంధువులు ఎవరైనా ఉంటే వెంటనే ఛత్రినాక పోలీస్ స్టేషన్ - 8712661293, 040- 27854788 ఈ పై నంబర్లకు సమాచారం ఇవ్వాలని ఛత్రినాక పోలీసులు కోరారు.

## గణేష్ ఉత్సవాన్ని సజావుగా, సురక్షితంగా శాంతియుతంగా నిర్వహించుకోవాలి



**మన తొలివెలుగు, మహేశ్వరం ప్రతినిధి ముత్తయ్య (24 ఆగస్ట్ 2026)**గణేష్ ఉత్సవాలను ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, అన్ని వర్గాల ప్రజలు శాంతియుతంగా, సామరస్య పూర్వకంగా జరుపుకోవాలని ఏసిపి శ్రీకాంత్ గౌడ్ స్పష్టం చేశారు. జరగబోయే గణేష్ ఉత్సవాన్ని దృష్టిలో ఉంచుకుని పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్‌లో పండుగ సందర్భంగా నిర్వహించిన శాంతిభద్రతల (పీస్) కమిటీ సమావేశంలో ఆయన పలు సూచనలు చేశారు. ఈ సమావేశానికి జీహెచ్‌ఎంసీ, జల్పల్లి సర్కిల్ డిప్యూటీ కమిషనర్ వెంకట్రావు, ఆర్‌జీఐఏ ఏసీపీ శ్రీకాంత్ గౌడ్, వివిధ సంబంధిత శాఖల అధికారులు, గణేష్ ఉత్సవ సమితి సభ్యులు, మున్సిపల్ మాజీ వైస్-చైర్మన్ అబ్దుల్లా సాది, నాయకులు షేక్ అఫ్జల్, యాతం పవన్ కుమార్ యాదవ్, యూసుఫ్ పటేల్, షంషుద్దీన్, ఆరిఫ్ అలీ ఇతర స్థానిక ప్రతినిధులు హాజరయ్యారు.గణేష్ ఉత్సవాన్ని సజావుగా, సురక్షితంగా శాంతియుతంగా నిర్వహించేందుకు వీలుగా, సమావేశంలో విద్యుత్ ఏర్పాట్లు, రహదారి పనులు, చెట్ల నరికివేత, పారిశుధ్యం, ట్రాఫిక్ నిర్వహణ ఇతర అవసరమైన ఏర్పాట్లకు సంబంధించిన పలు అంశాలపై వివరంగా చర్చించారు. ఉత్సవాన్ని విజయవంతంగా, శాంతియుతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలను ముందుగానే తీసుకోవాలని, అధికారులు, గణేష్ ఉత్సవ సమితి సభ్యులు, స్థానిక ప్రతినిధులు అందరూ సన్నిహితంగా సమన్వయం చేసుకోవాలని కోరారు. ఏదైనా సమస్య లేదా అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఊరేగింపుల సమయంలో ట్రాఫిక్ కు అంతరాయం కలగకుండా పోలీసులకు సహకరించాలన్నారు. రాత్రి వేళల్లో శబ్ద కాలుష్యం నిబంధనలకు లోబడి, డీజేలు, మైకుల వాడకంపై పరిమితులు పాటించాలన్నారు.

## కామ్రేడ్ సారంపల్లి మల్లారెడ్డి మరణం పార్టీకి రైతు ఉద్యమానికి తీరని లోటు

**సీపీఎం కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్**



**మన తొలివెలుగు కుత్బుల్లాపూర్ ప్రతినిధి టి రమేష్ :** సీపీఎం సీనియర్ నాయకులు, రైతు సంఘం అఖిల భారత నాయకులు కామ్రేడ్ సారంపల్లి మల్లారెడ్డి సోమవారం ఉదయం 3 గంటలకు హైదరాబాదులోని నిమ్స్ హాస్పిటల్ లో చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచారు. వారికి సీపీఎం కుత్బుల్లాపూర్ మండల కమిటీ ఆధ్వర్యంలో షాపూర్ నగర్ కార్యాలయంలో మల్లారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. వారి కుటుంబ సభ్యులకు పార్టీ ప్రగాఢ సానుభూతిని ప్రకటిస్తుందని సీపీఎం మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్ తెలిపారు. ఆయన మరణం పార్టీకి తీరని లోటు. వారు వరంగల్ జిల్లా నర్సంపేట ప్రాంతానికి చెందిన రైతు కుటుంబంలో జన్మించారు. ఆయన సాగునీటి వనరులు, భూ సమస్యలు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేసిన పోరాటయోధుడు. ఉమ్మడి రాష్ట్రంలో సాగునీటి వనరులపై రాష్ట్ర ప్రభుత్వానికి వ్యూహాత్మక పత్రం సమర్పించారు. ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీలో సభ్యులుగా చేరి అనేక బాధ్యతలు నిర్వర్తించారన్నారు. ఆయన ఉమ్మడి వరంగల్ జిల్లాలో అనేక సమస్యలపై పోరాడి పరిష్కరించిన యోధుడు. ఆయన లేడు అన్న వార్త ఊహించలేకపోతున్నాం అని అన్నారు . కుత్బుల్లాపూర్ మండలంతో ఉద్యమ అనుబంధం ఉన్నది. ఐడిపిఎల్ చౌరస్తాలో విద్యుత్ పోరాట అమరవీరుల స్మారక స్థూపాన్ని మల్లారెడ్డి చేతుల మీదనే ఆవిష్కరించడం జరిగిందని తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా ముఖ్యఅతిథిగా పాల్గొనడం జరిగిందని ఆయన గుర్తు చేశారు.ఆయన నిరాడంబర త, నిజాయితీకి గా నిలిచారని అన్నారు ఎన్ని కష్టాలు ఎదురైనా కడవరకు కమ్యూనిస్టుగా బతికిన పోరాటయోధుడని చివరకు తన దేహాన్ని కూడా వైద్య విద్యార్థుల పరిశోధనల కోసం గాంధీ హాస్పటల్ కు ఇవ్వడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు లింగస్వామి అంజయ్య ఖలీల్ వినయ్. వజీర్ సద్దాం తదితరులు పాల్గొన్నారు.

